క్లుప్తంగా

మానవత్వం చాటుకున్న ఏఎస్సై



శాయంపేట : మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్‌లో ఈసంపల్లి సందీప్ అనే యువకుడికి ఫిడ్స్ వచ్చి సడెన్‌గా సీసీ రోడ్డుపై పడడంతో తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం జరిగింది. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న ఏఎస్సై కుమారస్వామి, హోంగార్డు చందు యువకుడికి రక్తస్రావం కాకుండా క్లాత్‌తో కట్టుకట్టి 108కు సమాచారం ఇచ్చారు. చికిత్స నిమిత్తం పరకాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీంతో సీఐ రంజిత్‌రావు, ఎస్సై జక్కుల పరమేశ్, స్థానికులు ఏఎస్సై కుమారస్వామిని, హోంగార్డు చందును అభినందించారు.

అవగాహన సదస్సు

ఖిలా వరంగల్ : వరంగల్ కరీమాబాద్ లక్ష్మీనగర్‌లో మానవత స్వచ్ఛంద సంస్థ, మై చాయిస్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో శనివారం ఆల్కహాల్ వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. యువత మద్యానికి బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. గుజ్జారీనా రత్న శ్రీ, కలకోట్ల చిరంజీవి, మౌనిక, రవీందర్, అనిల్, రాగి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల పరామర్శ

పరకాల : గుండె శస్త్రచికిత్స చేయించుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి ఆరోగ్యం త్వరగా కోలుకోవాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సంగీత ఆకాంక్షించారు. ఈ మేరకు హనుమకొండలోని ఆయన నివాసంలో సంగీతతో పాటు బీజేపీ నాయకులు ముల్క ప్రసాద్, దయ్యాల దేవరాజు ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగితెలుసుకున్నారు.

ఆర్థికసాయం

కాజీపేట రూరల్ : డీజిల్ లోకోషెడ్‌లో టెక్నీషియన్–2గా పని చేస్తున్న మూల రాజు ఇటీవల మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబానికి శనివారం రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.35 వేల ఆర్థికసాయం అందజేశారు. కడిపికొండలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. నాయకులు నరేష్, సత్యనారాయణ, ఎస్.తిరుపతి, రవికిరణ్, శివప్రసాద్, నాగరాజు పాల్గొన్నారు.

టీఆర్‌పీఈయూ జిల్లా కమిటీ ఎన్నిక

హన్మకొండ : తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా ధరావత్ లక్ష్మణ్ నాయక్, సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సాంబరాజు శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా గొలుసు ఉపేందర్, జి.సంపత్, డి.నవీన్ కుమార్, ఉపాధ్యక్షులుగా వై.సంపత్ కుమార్, ఎ.వెంకటేశ్వర్లు, బి.వనిత, వి.సాంబమూర్తి, ఆర్.వేణు, చిర్ర సంజయ్ గౌడ్, ఎ.రాజకుమార్, ఎ.శ్రీనివాస్,కె.రాజు, రీజినల్ సెక్రటరీగా కడెం మహేష్, అదనపు కార్యదర్శి ఎస్.వేణు, జాయింట్ సెక్రటరీలు వేణు, కె.ప్రసన్న కుమారి, జాల రజని, బి.నవీన్ కుమార్, అన్వేష్ యాదవ్, రాజరపు సురేష్, పి.సుధాకర్, సీహెచ్.సువర్ణదేవి, యుగేందర్, భరత్ కుమార్, సెక్రటరీ కిరణ్ కుమార్ జె.స్వప్న ట్రెజరర్ డి.భాస్కరచారి, ఆఫీస్ సెక్రటరీగా రాజేంద్రప్రసాద్ ఎన్నికయ్యారని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శశి కుమార్ వివరించారు.

అనుమతి లేని పాఠశాల ఎదుట ధర్నా

విద్యారణ్యపురి : హనుమకొండలోని వడ్డేపల్లి ఎన్‌జీఓస్ కాలనీ ఏరియాలో ఓ ప్రైవేటు పాఠశాల అనుమతి లేకుండా నిర్వహిస్తున్నారని ఆరోపిస్తూ బీఎస్‌ఎఫ్, స్వేరో స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు మనోహర్, స్వేరో స్టూడెంట్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్, నాయకులు ప్రసన్నకుమార్, అలీమ్, దుర్గం రవి, శివకుమార్, వంశీ, రమేష్ పాల్గొన్నారు.

గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

నయీంనగర్ : కేయూసీ రోడ్‌లోని ఏకశిల ఉన్నత పాఠశాలలో కిండర్ గార్డెన్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలను శనివారం నిర్వహించారు. చిన్నారులు గ్రాడ్యుయేషన్ దుస్తుల్లో ముస్తాబై, సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలతో అలరించారు. ప్రిన్సిపాల్ బేతి శైలజా రెడ్డి చిన్నారులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు.

లాభాల బాటలో సూపర్‌బజార్

రామన్నపేట : వరంగల్ కల్పలత సూపర్ బజార్ (సహకార సొసైటీ) లాభాల బాటలో కొనసాగుతోందని సూపర్‌బజార్ అధ్యక్షుడు వర్ధమాన్ జనార్దన్ పేర్కొన్నారు. శనివారం సూపర్‌బజార్ సర్వసభ్య సమావేశం నిర్వహించగా జనార్దన్ మాట్లాడారు.సమావేశంలో మేనేజింగ్ డైరెక్టర్ జగన్‌మోహన్‌రావు, ఉపాధ్యక్షుడు ఎండి షఫీ, డైరెక్టర్లు ప్రభాకర్‌రెడ్డి, అయ్యల దానం, స్వర్ణలత, రఘురామారావు, మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

వెక్కిరిస్తున్న అసంపూర్తి నిర్మాణాలు

- నిధుల కొరతతో నిలిచిన పంచాయతీ భవనాలు
- బండతండాలో శిలాఫలకానికే పరిమితం
- కన్నారంలో శిథిలావస్థకు చేరుకున్న పరిస్థితి
- అద్దె భవనాల్లో నెట్టుకొస్తున్న అధికారులు



అసంపూర్తిగా లోక్యాతండా గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులు

వేలేరు : గత ప్రభుత్వ హయాంలో పునాదులు తీసి పిల్లర్లు, స్లాబు వేసి వదిలేసిన గ్రామపంచాయతీ భవనాలు అధికారులు, పాలకులను చూసి వెక్కిరిస్తున్నాయి. మండలంలోని గ్రామపంచాయతీలకు, తండాలకు సొంత భవనాలు లేకపోవడంతో అధికారులు అద్దె భవనాలు, రేకులషెడ్డుల్లో కార్యకలాపాలను నెట్టుకొస్తున్నారు. ఆయా గ్రామాల్లో గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులు నిధులు లేక మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలకు, అధికారులకు, సిబ్బందికి తిప్పలు తప్పడం లేదు. మండలంలో కొత్తగా లోక్యాతండా, చింతలతండా, బండతండా, గొల్లకిష్టంపల్లి, కన్నారం గ్రామాలకు నూతన గ్రామపంచాయతీ భవనాలు ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ప్రస్తుతం నాలుగు పంచాయతీలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. కన్నారం గ్రామపంచాయతీ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. శిథిలావస్థకు చేరుకున్న పంచాయతీ కార్యాలయంలోనే ప్రస్తుతం కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. చింతలతండా, లోక్యాతండా, బండతండా గ్రామాలకు ఎస్టీ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఎస్టీఎస్‌డీఎఫ్) ద్వారా ఒక్కో పంచాయతీ భవన నిర్మాణానికి రూ.20 లక్షల చొప్పున నిధులు కేటాయించారు. గొల్లకిష్టంపల్లి, కన్నారం గ్రామాలకు ఎస్‌ఆర్‌ఈజీఎస్ నిధుల నుంచి ఒక్కో పంచాయతీకి రూ.20 లక్షల చొప్పున నిధులు కేటాయించారు. కొన్ని గ్రామపంచాయతీల్లో అప్పటి సర్పంచులే పనులు చేపట్టారు. మరికొన్ని గ్రామపంచాయతీల్లో సర్పంచ్‌లు తమ అనుచరులతో పనులు చేయించారు. కాని ప్రభుత్వం నుంచి సకాలంలో బిల్లులు రాకపోవడంతో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు పూర్తి చేసి వాటిని అందుబాటులోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



స్లాబు నిర్మించి వదిలేసిన కన్నారం గ్రామపంచాయతీ భవనం



రేకుల షెడ్డులో కొనసాగుతున్న బండతండా గ్రామపంచాయతీ కార్యాలయం

పనులు పూర్తిచేయాలి



కన్నారం గ్రామపంచాయతీ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ఎస్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.20లక్షలతో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నిధుల కొరత కారణంగా బిల్లులు రావడం లేదని సంబంధిత కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే వదిలేశాడు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు చొరవ తీసుకుని వెంటనే గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులు పూర్తి చేయించి అందుబాటులోకి తీసుకురావాలి.

– ఆర్.వెంకన్న, కన్నారం గ్రామస్తుడు

గ్రామపంచాయతీ అభివృద్ధికి సహకరించాలి

ఆత్మకూరు : గ్రామపంచాయతీ అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో శనివారం గ్రామసభ జరిగింది. ఈ సభలో షాపింగ్ కాంప్లెక్స్ గదులకు వేలం వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జీపీ ఆదాయ వనరులను పెంచుకోవడానికి పౌరులంతా సహకరించాలన్నారు. ప్రజల సహకారంతో పంచాయతీలు బలోపేతం అవుతాయని పేర్కొన్నారు. కార్యదర్శి శ్వేత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి

కోటలో విదేశీయుల సందడి

ఖిలా వరంగల్ : ఖిలావరంగల్‌లోని మధ్యకోటను శనివారం ఫ్రాన్స్ దేశస్తులు వేర్వేరుగా సందర్శించారు. ఈ సందర్భంగా వారు అద్భుతమైన శిల్పకళ సంపదను తిలకించారు. అనంతరం ఖుషిమహాల్, ఏకశిల గుట్ట, రాతి, మట్టికోట అందాలను వీక్షించారు. కాకతీయుల చారిత్రక విశిష్టతను కోట గైడ్ రవియాదవ్ ఫ్రాన్స్ దేశస్తులు వివరించారు. సాయంత్రం టీజీటీడీసీ కోట ఇన్‌చార్జ్ గట్టికొప్పుల అజయ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సౌండ్ అండ్ లైటింగ్ షోను వారు వీక్షించారు.

గంగదేవిపల్లిని సందర్శించిన కేడీసీ విద్యార్థులు

గీసుకొండ: జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిని హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (కేడీసీ)లో రాజనీతిశాస్త్రం, చరిత్ర విభాగాల విద్యార్థులు శనివారం సందర్శించారు. చరిత్ర విభాగం హెడ్ ఇందిరాదేవి, రాజనీతిశాస్త్ర విభాగం హెడ్ బి.కవిత, అధ్యాపకులు కె.శ్రీదేవి, రవికుమార్, రాజేందర్, రాంరెడ్డి, రమేశ్, విద్యార్థులు గ్రామ అభివృద్ధిని పరిశీలించారు. గ్రామం సాధించిన ప్రగతి, పొందిన దేశ, రాష్ట్రస్థాయి అవార్డులు, ఆదర్శంగా నిలిచిన తీరును జిల్లా శిక్షణ మేనేజర్ కూసం రాజమౌళి వారికి వివరించారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

ఎల్కతుర్తి : ద్విచక్ర వాహనం ఢీ కొట్టిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. భీమదేవరపల్లి మండలం ముస్తాఫాపూర్‌లో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఎస్సై సాయిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాఫాపూర్ గ్రామానికి చెందిన గబ్బేటి లింగయ్య(60) అనే వృద్ధుడు వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. ఈనెల 21న తన వ్యవసాయ బావివద్ద పనులు ముగించుకుని తిరిగి కొత్తకొండ నుంచి ఇంటికి వస్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన బాల్లపెల్లి శ్రీనివాసరెడ్డి ద్విచక్రవాహనంపై అతీ వేగంగా, అజాగ్రత్తగా వచ్చి లింగయ్యను బలంగా ఢీ కొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన లింగయ్యను చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న లింగయ్య పరిస్థితి విషమించి మృతిచెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ఆత్మకూరు : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన మండలంలోని గుడెప్పాడ్ శివారులో చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం మల్లెచెరువుతండాకు చెందిన కొర్ర రంజిత్(20) బైక్‌పై శనివారం ములుగు జిల్లా లక్నవరం వెళ్లి తిరిగి వెళుతున్న క్రమంలో గుడెప్పాడ్ శివారులో రాంగ్‌రూట్‌లో వస్తున్న ట్రాక్టర్ బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన రంజిత్ అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కమలాపూర్ : మండలంలోని నేరెళ్ల వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నేరెళ్ల వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. నేరెళ్లకు చెందిన గోల్కొండ లక్ష్మీపతి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండగా పట్టుకుని ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ముందస్తు అరెస్ట్

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై నిరసనలు తెలిపేందుకు సన్నద్ధం అవుతున్నాడనే ముందస్తు సమాచారంతో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు కొమ్ముల శివను అదుపులోకి తీసుకున్నట్లు స్థానిక పోలీస్‌లు తెలిపారు. శివ మాట్లాడుతూ బడ్జెట్‌లో విద్యారంగానికి 2,3,108 కోట్ల నిధులు మాత్రమే కేటాయించడం బాధాకరమన్నారు.

జలమయమైన ఫాతిమానగర్ వీధులు

కాజీపేట రూరల్ : కాజీపేటలో శుక్రవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి ఫాతిమానగర్ వీధి రోడ్లు జలమయమయ్యాయి. ఫాతిమానగర్ అరుణోదయ యూత్ సెంటర్ నుంచి కేథడ్రల్ చర్చికి వెళ్లే రోడ్డు జలమయం కావడంతో బిషప్ బెరెట్టా హైస్కూల్ పదో తరగతి పరీక్ష రాసే విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికులు ఇబ్బంది పడ్డారు. గ్రేటర్ వరంగల్ అధికారులు, పాలకులు ఫాతిమానగర్ వీధుల్లో నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే కాజీపేట డీజిల్ కాలనీ మెయిన్ రోడ్‌లో పెట్రోల్ బంక్ వద్ద ఇరువైపులా రోడ్డు అకాల వర్షానికి జలమయంగా మారింది. వాహనదారులు, స్థానికులు ఇబ్బంది పడ్డారు.

వడ్డీలేని రుణాల మంజూరు హర్షణీయం



శాయంపేట : సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఏపీఎం శ్రీధర్‌రెడ్డి



ఆత్మకూరులో..



పరకాలలో.. రైతు సంక్షేమానికి కృషి..

- సీఎం, మంత్రుల చిత్రపటానికి పాలాభిషేకం

శాయంపేట : మండల కేంద్రంలోని సురేఖ మండల సమాఖ్య పరిధిలోని 841 స్వయం సహాయక సంఘాలకు రూ. 1కోటి 59లక్షల 60వేల రూపాయల వడ్డీలేని రుణాలు ప్రభుత్వం మంజూరు చేయడం హర్షణీయమని సురేఖ మండల సమాఖ్య అధ్యక్షురాలు కర్రు శిరీష, ఏపీఎం శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఆ సంఘం ఆధ్వర్యంలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం పర్యటనకు వచ్చిన సందర్భంగా స్వయం సహాయక సంఘాల మహిళలతో చేపట్టిన మహిళ శక్తి కార్యక్రమాల గురించి వారితో మాట్లాడి సంతృప్తితో స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలు మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ పథకం ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాకు రూ.100 కోట్లు మంజూరు చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు కేదారి, విజయ్‌కుమార్, ప్రభాకర్, హేమలత, సీబీఓ ఆడిటర్లు రామతార, మల్లేశం, వీఓఏలు, వీఓ అధ్యక్షురాలు పాల్గొన్నారు.

ఆత్మకూరు : రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని మాజీ ఎంపీటీసీ పర్వతగిరి మహేశ్వరి అన్నారు. మండలంలోని మహిళా సంఘాలకు రూ.1కోటి 13లక్షలు వడ్డీలేని రుణాలు మంజూరు చేయడంపై మహిళలు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వేలేరు : మండలంలోని 19 వీఓలలోని 469 సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 18న రూ.1 కోటి 8లక్షల94 వేల వడ్డీ లేని రుణాలు మంజూరు చేసినట్లు ఏపీఎం జయసుధ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్యలో వీఓలు, మహిళ సంఘాల అధ్యక్షులతో వడ్డీలేని రుణాలపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 2024 ఏప్రిల్ నుంచి జనవరి 2025 వరకు రుణాలు పొందిన మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలను వర్తింపజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పరకాల : రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని పరకాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాలల్లో జరిగిన బడ్జెట్ కేటాయింపుల్లో భాగంగా వ్యవసాయ రంగానికి అత్యధికంగా రూ.24వేల439 కోట్ల నిధులు, రైతు భరోసాకు రూ.18వేల కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ.1674 కోట్ల నిధులు కేటాయించినందుకు హర్షం వ్యక్తం చేశారు. పరకాల వ్యవసాయ మార్కెట్ యార్డులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పరకాల, భూపాలపల్లి ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయ రంగానికి అత్యధిక బడ్జెట్ కేటాయించడం సాహోసపేతమైన నిర్ణయమని కొనియాడారు. మార్కెట్ వైస్ చైర్మన్ మారేపల్లి రవీందర్, మార్కెట్ డైరెక్టర్స్ బొమ్మకంటి రుద్రమదేవి, కుమారస్వామి, పెండెల కుమారస్వామి, దాసరి భిక్షపతి, బుడిమే రాజయ్య, కుమారస్వామి పాల్గొన్నారు.

సఖి సేవలు వినియోగించుకోవాలి

సఖి సెంటర్ నిర్వాహకురాలు హైమావతి

కమలాపూర్ : సఖి అందించే సేవలను మహిళలు వినియోగించుకోవాలని సఖి సెంటర్ నిర్వాహకురాలు హైమావతి సూచించారు. కమలాపూర్‌లోని సెర్ప్ కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా చట్టం, సఖి సేవలపై శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మానవ అక్రమ రవాణా నేరమని, వాటికి పాల్పడితే ఆ చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటారన్నారు. సఖి అందించే కౌన్సెలింగ్, వైద్యం, పోలీస్, న్యాయ సహాయం, తాత్కాలిక వసతి తదితర ఐదు రకాల సేవలపై వివరించారు. గృహ హింస, లైంగిక వేధింపులు, అత్యాచారం వంటి వాటి నుంచి రక్షణ పొందేందుకు సఖి సెంటర్ 24 గంటలు పనిచేస్తుందని అన్నారు. సమస్య ఉన్నప్పుడు 181, 0870–2452112, 7382983088 నంబర్లకు కాల్ చేస్తే తక్షణ సాయం లభిస్తుందన్నారు. సఖి కేస్ వర్కర్ అనూష, ఐకేపీ ఏపీఎం నారాయణ, సీసీలు, వీఓలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హైమావతి

ఘనంగా శాలివాహన చక్రవర్తి జయంతి



శాలివాహన చక్రవర్తి చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

కమలాపూర్ : శాలివాహన చక్రవర్తి జయంతిని కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో శనివారం కమలాపూర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాలివాహన చక్రవర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. శాలివాహన చక్రవర్తి యుగ పురుషుడని, తెలుగు ప్రజల తొలి పండుగ ఉగాదికి నాంది పలికిన మహనీయుడు శాలివాహన చక్రవర్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి సంఘం రాష్ట్ర రాజకీయ విభాగం ఉపాధ్యక్షుడు నాంపెల్లి ప్రభాకర్, నాయకులు మోతె జగన్, పిడిశెట్టి కుమారస్వామి, రమేశ్, సర్దన స్వామి, నాంపెల్లి మొగిలి, తరిగొప్పుల నరేశ్, రాజు, లింగాల మాధవ్, సముద్రాల శ్రీనివాస్, తాటికంటి రవీందర్, కుమ్మరి కులస్తులు పాల్గొన్నారు.

చైతన్యయాత్రను జయప్రదం చేయాలి

శాయంపేట : రేపు పెద్దపల్లిలో ప్రారంభమైయ్యే తెలంగాణ ఉద్యమకారుల చైతన్యయాత్రకు ఉద్యమకారులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి గజ్జి శంకర్ అన్నారు. శనివారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి రవీందర్ అధ్యక్షతన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో ప్రవేశపెట్టిన విధంగా 250గజాలు ఇంటి స్థలం, రూ.25వేల గౌరవ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈనెల 24 పెద్దపల్లిలో ప్రారంభమైన యాత్ర పరకాల చేరుకుంటుందని, తెలంగాణ ఉద్యమకారులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా కో కన్వీనర్, మండల ప్రధాన కార్యదర్శి చల్లా శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పల్లెబోయిన సారయ్య, గిద్దమారి సురేశ్, నాయకులు ఎండీ రఫీ, రాయరాకుల మొగిలి, అడుప ప్రభాకర్, మారేపల్లి సదానందం, చిందం ప్రభాకర్, తుమ్మ ప్రభాకర్, కోడెపాక బాబు, పసుల ప్రవీణ్, కానుగుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శంకర్

దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాల ఏర్పాటు

- ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి

ఆత్మకూరు : ప్రజల దాహార్తిని తీర్చేందుకే గ్రామ పంచాయతీల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కొత్తబస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి తీవ్రత పెరుగుతున్నందున చలివేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శ్వేత, పరికిరాల వాసు, రవి, జీపీ సిబ్బంది రాంబాబు, సారంగం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి

నీటిని పొదుపుగా వాడుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న విశ్రాంత అటవీశాఖ అధికారి



ఐనవోలు : విద్యార్థులతో కలిసి జల సంరక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న బాలవికాస ప్రతినిధులు

ఎల్కతుర్తి : జల దినోత్సవం సందర్భంగా శనివారం ఎల్కతుర్తి మండలం దామెర గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక(యునైటెడ్ ఫోరం ఫర్ ఎన్విరాన్మెంటల్ ప్రొటెక్షన్ వరంగల్) ఆధ్వర్యంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు గీత అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో ముఖ్యతిథిగా విశ్రాంత అటవీశాఖ అధికారి, యూఎఫ్ఈపీ అధ్యక్షుడు పురుషోత్తం హాజరై మాట్లాడారు. నీటి పొదుపు, నీటి కాలుష్య నివారణ, ఇంకుడు గుంతల ఏర్పాటు, చెట్ల పెంపకం, దేవునూర్ అటవీ ప్రాంత సంరక్షణ అంశాలపై అవగాహన కల్పించారు. నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. భూ గర్భ జలాలను సంరక్షించేందుకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చెట్లను పెంచడం వలన సకాలంలో వర్షాలు కురుస్తాయని సూచించారు. నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, పోస్టర్ మేకింగ్ పోటీలను నిర్వహించి బహుమతులు అందించాలని అన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐనవోలు: మండలంలోని వెంకటాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ నీటి దినోత్సవంలో భాగంగా శనివారం బాల వికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో విద్యార్థులు, గ్రామస్తులతో ర్యాలీ నిర్వహించి జల సంరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం హిమనదాలు–సంరక్షణ అనే అంశంపై విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో బాలవికాస ప్రతినిధి మధు, వాటర్ ప్లాంట్ అధ్యక్షుడు సుబ్బారావు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ పోస్టును ఎస్సీలకు కేటాయించాలి

కాజీపేట రూరల్ : కాజీపేట 48వ డివిజన్ దర్గాలోని శాస్త్రీనగర్ అంగన్‌వాడీ సెంటర్ టీచర్ పోస్టును ఎస్సీలకు కేటాయించాలని శనివారం ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ సింగారపు రవిప్రసాద్, అంబేడ్కర్ యువజన సంఘం 48వ డివిజన్ అధ్యక్షుడు కె.ప్రేమ్‌నాథ్‌లు హనుమకొండ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ టీచర్ పోస్టు ఖాళీగా ఉంటుందని, ఇక్కడ పని చేసిన టీచర్ ప్రమోషన్‌పై సూపర్‌వైజర్‌గా వెళ్లిందని తెలిపారు. ఆ పోస్టును ఎస్సీలకు కేటాయించాలని ఈ సందర్భంగా వారు వినతిలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఉన్నారు.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

న్యూశాయంపేట : భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా హనుమకొండ కాళోజీ కళాక్షేత్రంలో నేడు (ఆదివారం) నిర్వహించనున్న ఎస్‌ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పూర్వ జిల్లా మాజీ కార్యదర్శి రాగుల రమేష్ పిలుపునిచ్చారు.